సాక్షి
వికారాబాద్

శనివారం । 28 । డిసెంబర్ । 2024



నగర పంచాయతీగా..

మోమిన్‌పేట నగర పంచాయతీగా మారనుందా అంటే.. అధికారుల నుంచి అవుననే సమాధనమే వస్తోంది. 10లో▸



శాంతిభద్రతలే లక్ష్యం

లగచర్ల ఘటన నేపథ్యంలో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. 10లో▸



ఎరువు.. బరువు!

ప్రస్తుత పరిస్థితుల్లో పంటల సాగు భారంగా మారింది. అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారుతోంది. 11లో▸

న్యూస్‌రీల్

వానరానికి అంత్యక్రియలు



వానరాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్న స్థానికులు

కొడంగల్ రూరల్: మండలంలోని పర్సాపూర్‌లో శుక్రవారం ఉదయం అనారోగ్యంతో వానరం మృతి చెందింది. గమనించిన పరిసర వాసులు గ్రామస్తులకు తెలియజేశారు. దీంతో స్థానికులు, హిందూవాహిని సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. వానరాన్ని ట్రాక్టర్‌లో ఉంచి టపాసులు కాలుస్తూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

చెన్నకేశవుడికి వెండి తొడుగులు



అర్చకుడికి వెండి ముఖం, సుదర్శన హారాన్ని అందజేస్తున్న లోకుర్తి జయతీర్థాచారి

కొడంగల్ రూరల్: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ చెన్నకేశవస్వామికి శుక్రవారం ఆలయ అర్చకుడు అక్కి శ్రీనివాస మూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు లోకుర్తి జయతీర్థాచారి స్వామివారికి రజిత ముఖం, (సాలిగ్రామ హార)సుదర్శన హారాన్ని చేయించారు. వాటిని ఆలయ అర్చకుడికి అందజేయడంతో స్వామివారికి అలంకరించారు. అనంతరం బ్రాహ్మణులకు అన్న ప్రసాదాలు అందజేశారు.

మన్మోహన్‌సింగ్ మరణం తీరనిలోటు

స్పీకర్ ప్రసాద్‌కుమార్



అనంతగిరి: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి చెందడం యావత్ దేశానికి తీరని లోటని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. దేశం ఒక గొప్ప నాయకున్ని, ఆర్థికవేత్తను కోల్పోయిందన్నారు. ఆయన నిరాడంబర జీవితంతో ఎంతో మంది నేతలు అనేక విషయాలు నేర్చుకుని ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. పీవీ నర్సింహారావు నేతృత్వంలో ఆర్థికమంత్రిగా ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని గుర్తు చేసుకున్నారు. 2004 నుంచి రెండు పర్యాయాలు ప్రధానిగా ఈ దేశానికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ మరువలేమన్నారు.

చిత్రలేఖనంతో ఘన నివాళి



మన్మోహన్‌సింగ్ చిత్రాన్ని వేస్తున్న అశోక్

దౌల్తాబాద్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల మండలంలోని యాంకి గ్రామానికి చెందిన సున్నపు అశోక్ అనే చిత్రకారుడు తన కళా నైపుణ్యంతో మన్మోహన్‌సింగ్ చిత్రాన్ని గీసి ఘనంగా నివాళులర్పించారు. భారతదేశానికి నిజమైన వాస్తు శిల్పుల్లో మన్మోహన్‌సింగ్ ఒకరని కొనియాడారు. దేశానికి ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు.

లీగ్ పోటీల్లో రన్నరప్‌గా తాండూరు జట్టు



తాండూరు టౌన్: తెలంగాణ జూనియర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో తాండూరు జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ నెల 23నుంచి 27వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన అండర్ -16 టీ-20 టోర్నీలో ఆదిలాబాద్, నిర్మల్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్ జిల్లా నుంచి తాండూరులోని సహారా క్రికెట్ అకాడమీ జట్టు పాల్గొన్నాయి. ఫైనల్‌కు చేరుకున్న తాండూరు జట్టు హోరాహోరీగా పోరాడి రన్నరప్‌గా నిలిచింది. ఈటోర్నీలో ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా, ఉత్తమ కీపర్‌గా తాండూరు జట్టు క్రీడాకారులు అంకుశ్ (255 పరుగులు), శివశంకర్ (8 డిస్మిజల్స్) అవార్డు అందుకున్నారు. టోర్నీలో సత్తాచాటిన క్రీడాకారులను కోచ్ జగన్నాథ్‌రెడ్డి, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.



ఆయిల్ పామ్ దిశగా అడుగులు

జిల్లాలో మొదటి సారి ఆయిల్ పామ్ దిశగా అడుగులు పడుతున్నాయి. జిల్లాలో 50 వేల ఎకరాల్లో ఉద్యాన వన పంటలను సాగుచేస్తున్నారు. ఇటీవల ఆయిల్ పామ్ ఆవశ్యకతను గుర్తించిన ప్రభుత్వం జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్దేశించింది. మన జిల్లాలో 35,000 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేసేందుకు నేలలు అనుకూలంగా ఉన్నాయని ఉద్యానవన శాఖ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ ఏడాది కనీసం 2వేల ఎకరాల్లో పంట సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఇప్పటి వరకు 1,750 మంది రైతులు సాగు చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం వెయ్యి ఎకరాల్లో పంట సాగు ప్రారంభమైంది.

సగం మందికే రుణమాఫీ


జిల్లాలో సగం మంది రైతులకే పంట రుణాలు మాఫీ అయ్యాయి. మిగిలిన వారు రుణమాఫీ పథకం కోసం ఎదురు చూస్తున్నారు. మూడు విడతల్లో రుణమాఫీ అమలు చేశారు. జిల్లాలో 5.90 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా 2.50 లక్షల మంది రైతులు ఉన్నారు. గత ఏడాది (2023–24) 1,78,522 మంది రైతులు వివిధ బ్యాంకుల్లో పంట రుణాలు పొందారు. ఏటా సగటున రూ.1,800 కోట్ల వరకు రుణాలు తీసుకుంటున్నారు. కాగా గతేడాది రూ.2,582 కోట్ల రుణాలు ఇచ్చారు. మొదటి దశలో లక్ష రూపాయాల లోపు రైతులకు రుణాలు మాఫీ చేశారు. 46,633 వేల మంది రైతులకు రూ.256.26 కోట్ల రుణమాఫీ వర్తించింది. రెండో విడతలో రూ.1.5 లక్షల పంట రుణాలను మాఫీ చేశారు. ఇందులో రూ.262.64 కోట్ల మాఫీ అయ్యాయి. 26,438 మంది రైతులు లబ్ధి పొందారు. మూడో విడతలో 18,885 మంది రైతులకు రూ.247.71 కోట్ల మాఫీ చేశారు. మూడు విడతల్లో కలిపి సగం మంది రైతులకే రుణవిముక్తి లభించింది.

తగ్గిన మొక్కజొన్న, పత్తి దిగుబడి

మొక్కజొన్న విత్తు సమయంలో వర్షాలు కాస్త ఆలస్యం కావడంతో సగం విత్తనాలు పాడయ్యాయి. దీంతో చాలా చోట్ల రెండో సారి విత్తుకోవాల్సి వచ్చింది. అనంతరం జూలై, ఆగస్టు మాసాల్లో కురిసిన అధిక వర్షాలు రైతుకు తీవ్ర నష్టం చేకూర్చాయి. మొక్కజొన్నతోపాటు పత్తి పంట కూడా దెబ్బతింది. జిల్లాలో 1.4లక్షల మంది రైతులు 2.4లక్షల ఎకరాల్లో పత్తి పంట వేశారు. ఎకరాకు సగటున 10 నుంచి 16 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా అతి వృష్టి కారణంగా ఎకరాకు కేవలం నాలుగు నుంచి ఆరు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. దీంతో పెట్టుబడులు కూడా రాలేదు. 46 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేయగా దిగుబడి గణనీయంగా తగ్గింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ గాడి తప్పడం కూడా రైతులను నష్టాలపాలు చేసింది.



నష్టాల సేద్యం!





ఒడిదుడుకుల మధ్య పంటల సాగు

- వానాకాలంలో వెంటాడిన అతివృష్టి
- యాసంగిలో వరి రైతులకు కష్టాలు
- పాడైన పంటలకు అందని పరిహారం
- గణనీయంగా తగ్గిన పత్తి, కంది దిగుబడులు
- పత్తాలేని రైతు భరోసా.. సగం మందికే రుణమాఫీ

వికారాబాద్: జిల్లాలో 2024లో వ్యవసాయ రంగం తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంది. నాలుగేళ్లుగా అతివృష్టి, అనావృష్టి కారణంగా సతమతమైన రైతన్నను ఈసారైనా కలిసివస్తుందనుకున్న కాలం మరోసారి కన్నీటి పాలుచేసింది. వాతావరణ పరిస్థితులు అనుకూలించక, ఖరీఫ్ ఆరంభం నుంచే వరుణుడు అధిక వర్షాలతో విరుచుకుపడటంతో రైతన్న నష్టాలను చవిచూశాడు. ఈ ఏడాది కూడా అన్నదాతకు కన్నీరే మిగిల్చింది. మర్పల్లి, మోమిన్‌పేట, వికారాబాద్, నవాబుపేట, పరిగి, దోమ, ధారూరు మండలాల్లో భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాలో ప్రధాన పంటలైన పత్తి, మొక్కజొన్న, కంది వానాకాలం ఆరంభం నుంచే అతివృష్టి వల్ల దెబ్బతిన్నాయి. పంట దిగుబడులు గణనీయంగా తగ్గాయి. గత యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లలో తలెత్తిన ఇబ్బందులు రైతును మరింత కుదేలయ్యేలా చేసింది. కేంద్రాల నిర్వాహకుల



ఖరీఫ్ సీజన్‌లో భారీవర్షాలకు నవాబుపేట మండలంలో దెబ్బతిన్న టమాటా పంట

కొర్రీలు పెట్టడంతో 50 శాతం పంటను దళారులకే విక్రయించారు.

అందని పెట్టుబడి సాయం

వరుస తుఫాన్ల కారణంగా వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం 1,350 మంది రైతులకు సంబంధించిన 1,500 ఎకరాలకు మాత్రమే రూ.1.51 కోట్ల పరిహారం చెల్లించి చేతులు దులుపుకొంది. గత ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఏటా రూ.320 కోట్లు అన్నదాతల ఖాతాల్లో జమ చేసేది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారం చేపట్టి ఏడాది ముగిసినా రైతుల ఖాతాల్లో డబ్బు జమ కాలేదు.

వానాకాలం సీజన్‌లో 25 వేల ఎకరాల్లో కూరగాయ పంటలను సాగుచేశారు. ముఖ్యంగా క్యారెట్, బీట్రూట్, టమాటా, చిక్కుడు, బెండ, బీర్నీస్, క్యాబేజీ వంటి పంటలతో పాటు ఆకుకూరలు సాగుచే

కూరగాయలదీ అదే పరిస్థితి

శారు. సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో టమాటా, క్యారెట్, బీట్‌రూట్ పంటలు చేతికి వచ్చే సమయంలో అధిక వర్షాలు, వడగండ్ల వానలకు దిగుబడులు గణనీయంగా తగ్గాయి. అధిక వర్షాలకు పూల తోటలు కూడా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు.

జిల్లాలో సాగు భూమి	:	5.90 లక్షల ఎకరాలు
రైతులు	:	2.50 లక్షల మంది
బ్యాంకుల్లో పంట రుణాలు పొందిన వారు	:	1,78,522
రుణమాఫీ వర్తించిన వారు	:	46,633 మంది

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న జీపీ కార్మికులు

కేశంపేట: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జీపీ వర్కర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి అన్నారు. సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం జీపీ కార్మికులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 12,790 పంచాయతీల పరిధిలో 60వేల మంది కార్మికులు పని చేస్తున్నారని అన్నారు. 500 జనాభాకు ఒక్క కార్మికుడి పేరును ఆన్‌లైన్‌లో అధికారులు ఎంట్రీ చేశారని గుర్తుచేశారు. జనాభా ప్రాతిపదికన కాకుండా ప్రస్తుతం పని చేస్తున్న ప్రతి ఒక్కరినీ ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలన్నారు. పని చేస్తున్న కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, జీఓ 51ని సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, అర్హులైన కార్మికులను బిల్ కలెక్టర్లు, కారోబార్లు, సహాయ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫి ట్స్ అందించాలని, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగం కల్పించాలని, కార్మికులందరికీ షరతులు లేకుండా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా జనరల్ సెక్రెటరీ రాంచందర్, పరేషా, యాదయ్య, మల్లయ్య, మాసయ్య, పద్మ, బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో కలపొద్దు



ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల: నూతనంగా ఏర్పాటు చేయనున్న చేవెళ్ల మున్సిపాలిటీలో తమ గ్రామాన్ని విలీనం చేయొద్దంటూ రామన్నగూడ గ్రామస్తులు శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. చేవెళ్లకు దూరంగా ఉన్న తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపొద్దన్నారు. గ్రామంలో ఇప్పటికీ ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. మున్సిపాలిటీలో కలిపితే పన్నుల భారాన్ని తట్టుకోలేమని వాపోయారు.



సందడిగా సిడె ఊరేగింపు

ధారూరు: మండలంలోని నాగారం గ్రామంలో తుల్జాభవానీ మాత జాతరలో భాగంగా శుక్రవారం రాత్రి సిడె వేడుక నిర్వహించారు. సిడె చివర మేకను వేలాడదీసి గ్రామంలో ఊరేగిస్తూ ఆలయానికి చేరుకున్నారు. గుడి చుట్టు ప్రదక్షిణలు చేశారు. ఈ వేడుకను తిలకించడానికి సమీప గ్రామాల నుంచి ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు నరోత్తమ్‌రెడ్డి, ధారూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీపీఎం సభలకు సిద్ధం

- నేడు, రేపు పార్టీ జిల్లా మహాసభలు
- ముస్తాబవుతున్న ఇబ్రహీంపట్నం
- హాజరుకానున్న రాష్ట్రస్థాయి నేతలు

ఇబ్రహీంపట్నం: సీపీఎం జిల్లా మహాసభలకు ఇబ్రహీంపట్నం ముస్తాబవుతోంది. శని, ఆదివారాల్లో నిర్వహించనున్న సభల కోసం ప్రధాన చౌరస్తాలు, రోడ్ల వెంట, డివైడర్లపై ఎర్ర జెండాలు రెపరెపలాడుతున్నాయి. మహాసభలకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు వెలిసాయి. మొదటిరోజు శనివారం మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో భారీ బహిరంగసభ ఏర్పాటు చేశారు. పార్టీ చేస్తున్న పోరాటాలు, చేయాల్సిన కార్యక్రమాలను వివరించనున్నారు. సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జాన్‌వెస్లీ, డీజీ నరసింహారావు హాజరుకానున్నారు. మరుసటి రోజు ఆదివారం వరకు స్థానిక భారత్



గార్డెన్‌లో జరిగే ప్రతినిధుల సభలో వివిధ అంశాలపై చర్చించనున్నారు. ప్రధానంగా జిల్లాలో నెలకొన్న ప్రజా సమస్యలపై చర్చించడంతోపాటు వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నారు. పార్టీ జిల్లా నూతన సారథులను ఎన్నుకోనున్నారు. కొత్త కార్యవర్గం ఎన్నిక, వివిధ అంశాలపై చేసిన తీర్మానాలతో సభలు ముగుస్తాయి.

మోసాలతో కాంగ్రెస్ పాలన

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి

ఆమనగల్లు: రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ పాలన అంతా అబద్ధాలు, మోసాలతో సాగుతోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఆరోపించారు. రాబోయే స్థానిక ఎన్నికల కోసం పార్టీ శ్రేణులంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బూత్ కమిటీ ఎన్నికలు, సంస్థాగత ఎన్నికల నిర్వహణ, పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. హామీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఇచ్చిన ఏ ఒక్క గ్యారెంటీనీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. నిరంకుశ పాలనకు స్వస్తిచెప్పి ప్రజాస్వామ్య పాలన అందిస్తామని.. నియంతృత్వ, నిరంకుశ పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు. లగచర్ల భూ సేకరణపేరిట రైతులపై అక్రమ కేసులను పెట్టడం, పోలీసులతో దాడులు చేయించడం అందుకు ఉదాహరణ అన్నారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన, భూ సేకరణపేరిట పేదల ఇళ్లను కూలగొడుతున్నారని ఆయన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ ఉద్యమిస్తుందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రేమేందర్‌రెడ్డి పార్టీశ్రేణులకు సూచించారు. పార్టీని బూత్‌స్థాయి నుంచి సంస్థాగతంగా బలోపేతం చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ మంచి విజయాలు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు ఆచారి, పార్టీ సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్, ఎన్నికల అధికారి కట్ట సుధాకర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీప్‌చారి, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై అనుమానాలెన్నో..!

- పెట్టుబడి సాయం కోసం ఎదురు చూపు
- మార్గదర్శకాలు జారీ కాలేదంటున్న వ్యవసాయాధికారులు
- జిల్లాలో 2.50లక్షల మంది రైతులు
- గత ప్రభుత్వ హయాంలో ప్రతి సీజన్‌కు రూ.320 కోట్ల సాయం

తాండూరు: రైతు భరోసా పథకం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలు చేసే కుటుంబాలకు, ఐటీ చెల్లించే వారికి, ఒకే కుటుంబంలో భూమి ఎక్కువగా ఉన్న వారికి పంట పెట్టుబడి సాయం అందకపోవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అన్నదాతల సంక్షేమం కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని అమలు చేసింది. కాంగ్రెస్ సర్కారు కొలువుదీరిన తర్వాత రైతు భరోసా పేరిట పథకం అమలు చేయాలని నిర్ణయించింది. అధికారం చేపట్టి ఏడాది దాటినా పెట్టుబడి సాయం అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పథకం అమలుకు ప్రభుత్వం సిద్ధమైంది. సంక్రాంతి పండుగ లోపు రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేయనున్నట్లు ప్రకటించింది. అయితే ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. సంక్రాంతి లోపు పథకం అమలు చేస్తారా లేదా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్ నుంచే పథకం అమలు చేస్తారని రైతులు ఎంతో ఆశగా



ఎదురు చూశారు. కానీ వారి పెట్టుబడి సాయం అందకపోవడంతో అప్పులు చేసి పంటలు సాగు చేశారు. అధిక వర్షాల కారణంగా పంటలకు నష్టం వాటిల్లింది. యాసంగి సీజన్ నాటికైనా సాయం అందించాలనే డిమాండ్ పెరుగుతోంది. జిల్లాలో వానాకాలం సీజన్‌లో 6 లక్షల ఎకరాలు, యాసంగి సీజన్‌లో 1.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారు. 2018 అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు బంధు పథకం అమలులోకి తీసుకొచ్చింది. ఎకరాకు రూ.4వేల చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు. తర్వాత సీజన్ల నుంచి ఎకరాకు రూ.5వేల చొప్పున పెట్టుబడి సాయం అందించారు. 2018 నుంచి 2023 వరకు పథకాన్ని అమలు చేశారు. దీంతో సాగు విస్తీర్ణం భారీగా పెరుగుతూ వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పథకం అమలు కాలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అర్హులెవరనే దానిపై ఉత్కంఠ

జిల్లాలో సుమారు 6లక్షల ఎకరాల సాగు భూమి.. 2.50లక్షల మంది రైతులు పట్టాదారు పాసు పుస్తకాలు కలిగి ఉన్నారు. పట్టదారు పాసు పుస్తకం ఉన్న ప్రతి రైతుకూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద సీజన్‌కు రూ.260కోట్ల నుంచి రూ.320 కోట్ల వరకు రైతుల ఖాతాల్లో జమ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సర్కారు ఉద్యోగులకు, ఐటీ చెల్లించే వారికి పెట్టుబడి సాయం వర్తించదంటూ ప్రకటించింది. ఒకే కుటుంబంలో భూమి ఎక్కువగా ఉన్న వారికి సైతం పెట్టుబడి సాయం ఎత్తివేసే అవకాశం ఉంది. ఒక్కో రైతుకు పెట్టుబడి సాయం అందిస్తుందా.. లేదా ఎకరా చొప్పున పథకం అమలు చేస్తుందా అనే దానిపై స్పష్టత రాలేదు. మరోవైపు శాసన సభ సమావేశాలలో రైతు భరోసా బిల్లు ఆమోదం పొందినా ఇప్పటి వరకు జిల్లా అధికారులకు మార్గదర్శకాలు జారీ కాలేదు. మరోవైపు సంక్రాంతి పండుగ మరో 18 రోజులు మిగిలింది. అప్పటిలోగా పథకం ఎలా అమలు చేస్తారు అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

> **మార్గదర్శకాలు విడుదల కాలేదు**
>
> రైతు భరోసా పథకం అమలుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మొదలు పెడతాం. జిల్లాలో రైతు భరోసా పథకం అమలు చేయాలని ఒత్తిడి పెరుగుతోంది.
>
> – మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

భక్తులపై వీధికుక్కల దాడి

యాలాల: మండల పరిధిలో కొనసాగుతున్న ముద్దాయిపేట ఎల్లమ్మ జాతరలో భక్తులపై వీధికుక్కలు దాడి చేశాయి. గమనించిన స్థానికులు వెంటనే వారిని తాండూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శుక్రవారం ప్రారంభమైన ఈ జాతరకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. సాయంత్రం సిడే ఊరేగింపును చూసేందుకు వచ్చిన పలువురు భక్తులు, మహిళలపై వీధికుక్కలు దాడి చేసి కరిచాయి. ఈ ఘటనలో విశ్వనాథ్‌పూర్, పగిడియాల గ్రామాలకు చెందిన మహిళలతో పాటు ధారూరు మండలానికి చెందిన పలువురు మహిళలు గాయపడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు క్షతగాత్రులను వైద్యులు నగరానికి రిఫర్ చేశారు.

మహిళ మెడలోంచి గొలుసు చోరీ

అనంతగిరి: బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఓ మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ చేశారు. ఈ ఘటన వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్ శివారులోని శివరాంనగర్ కాలనీకి చెందిన భ్రమరాంబ సదాశివపేటలో ఉండే కూతురు ఇంటికి మధ్యాహ్నం బయలుదేరింది. బస్సు ఎక్కి కూర్చుని మెడలో గొలుసు చూసుకోగా కనిపించలేదు. దీంతో బస్ నిలిపి ప్రయాణికుల వద్ద చెక్ చేసినా కనిపించలేదు. దీంతో బాధితురాలు వికారాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కలప రవాణా చేస్తున్న లారీ సీజ్



పోలీసులు సీజ్ చేసిన లారీ, చిత్రంలో డ్రైవర్ హైమద్

కుల్కచర్ల: కలప అక్రమంగా రవాణా చేస్తున్న లారీని సీజ్ చేశారు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఫారెస్ట్ అధికారులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని అడవి వెంకటాపూర్ శివారులో హైమద్ అనే వ్యక్తి తన లారీలో అనుమతులు లేకుండా కలప తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మొయినుద్దీన్ ఘటనా స్థలికి చేరుకుని హైమద్‌పై కేసు నమోదు చేసి లారీని పరిగి అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. శనివారం ఉన్నతాధికారుల ఆదేశానుసారం జరిమానా విధిస్తామన్నారు.

వ్యక్తి అదృశ్యం

హయత్‌నగర్: క్రిస్మస్‌కు తన సోదరుడి ఇంటికి వెళ్దామంటే భార్య నిరాకరించడంతో మనస్థాపానికి గురైన వ్యక్తి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఈ ఘటన శుక్రవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరు రవిశంకర్ కాలనీకి చెందిన పోకల వెంకటేశ్ ఓ ప్రైవేట్ కంపెనీలో అకౌంటెంట్. ఆయనకు ఏడాదిక్రితం పల్లవితో వివాహమైంది. బుధవారం క్రిస్మస్ పండుగకు ఇంటికి రావాలని వెంకటేశ్ సోదరుడు పోకల గాబ్రియెల్ వారిని ఆహ్వానించాడు. తనకు ఆరోగ్యం బాగోలేదని భర్తను వెళ్లమని పల్లవి చెప్పింది. దీంతో మనస్థాపం చెందిన వెంకటేశ్ గురువారం డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. భార్య ఫోన్ చేసినా స్పందించలేదు. శుక్రవారం మరోసారి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. పల్లవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: గంజాయి విక్రయిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 1.1 కిలోల గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లాకు చెందిన మూడు సంతోష్ అనే వ్యక్తి తరచూ ఖమ్మం నుంచి గంజాయిని తీసుకువచ్చి భరత్ రమేష్‌బాబు అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు అప్పగించేవాడు. శుక్రవారం అతను వసంతనగర్ బస్టాప్ వద్ద శుక్రవారం భరత్ రమేష్ బాబుకు గంజాయి అప్పగిస్తుండగా పోలీసులు దాడి చేసి రమేష్ బాబును అదుపులోకి తీసుకున్నారు. సంతోష్ వారికి చిక్కకుండా తప్పించుకున్నాడు.

నగర పంచాయతీగా మోమిన్‌పేట?

- పారిశ్రామిక వాడలు, నాలుగు వరుసల రహదారితో పెరిగిన పట్టణీకరణ
- అప్‌గ్రేడ్ అయితే శరవేగంగా అభివృద్ధి



మోమిన్‌పేట గ్రామ వ్యూ

మోమిన్‌పేట: మోమిన్‌పేట మండల కేంద్రం నగర పంచాయతీగా మారనుందా అంటే.. అధికారుల నుంచి అవుననే సమాధానమే వస్తోంది. శరవేగంగా అభివృద్ధి చెందుతోన్న మోమిన్‌పేటకు నగర పంచాయతీకి కావాల్సిన అన్ని అర్హతలున్నాయంటున్నారు. అదే జరిగితే మండలం మరింత వేగంగా అభివృద్ధి చెందనుందని మేధావులు పేర్కొంటున్నారు. మండల కేంద్రం చుట్టూ పారిశ్రామిక వాడలు ఏర్పడడంతో గ్రామ జనాభా నానాటికి పెరుగుతోంది. ఇక్కడ సుమారు వంద ఎకరాల్లో నూతన వెంచర్ల ఏర్పాటుతో గ్రామ విస్తీర్ణం చుట్టూ పది కిలోమీటర్ల వరకు విస్తరించింది. వేగంగా పట్టణీకరణ చెందుతోంది. గ్రామంలో నాలుగు వలసల రహదారి రెండు కిలోమీటర్ల మేర నిర్మించడంతో వ్యాపార వనరులు పెరిగాయి. వందేళ్ల క్రితం మోమిన్‌పేట వ్యాపార కేంద్రం విరాజిల్లిందని గ్రామ పెద్దలు చెబుతుంటారు. పదివేల జనాభా ఉన్న పట్టణంలో 6,947 మంది ఓటర్లు ఉన్నారు. ప్రభుత్వం ఇటీవల నగర పంచాయతీలు అప్‌గ్రేడ్ చేసేందుకు అర్హమైన పంచాయతీలను గుర్తించేందుకు అధికారుల నుంచి ప్రపోజల్స్‌ను సేకరిస్తోంది. గ్రామానికి చుట్టూ ఐదు కిలోమీటర్ల దూరం పరిధిలో ఉన్న పంచాయతీలను విలీనం చేస్తూ నగర పంచాయితీగా రూపాంతరం చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. మండల కేంద్రంతో పాటుగా ఐదు కిలోమీటర్ల పరిధిలోని ఆరు గ్రామ పంచాయతీలను విలీనం చేస్తే 12,627మంది ఓటరులు ఉంటారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉండడంతో గడిచిన పదేళ్లలో రియల్ వ్యాపారం జోరుగా సాగుతోంది. దీంతో గ్రామం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఎస్‌టీఓ, ఎక్సైజ్, సివిల్ సీఐ కార్యాలయాలతో పాటుగా సివిల్ సప్లై గోదాంలు సైతం ఉన్నాయి.

జనాభా వివరాలు

గ్రామాలు	ఓటర్లు
మోమిన్‌పేట	6,947
చంద్రాయన్‌పల్లి	901
రావులపల్లి	420
బూరుగుపల్లి	903
కాస్లబాదు	589
గోవిందాపూర్	834
మొరంగపల్లి	2,033
మొత్తం	12,627

అభివృద్ధికి నాంది



నగర పంచాయతీగా రూపాంతరం చెందితే గ్రామం మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రభుత్వం నుంచి నిధులు ఎక్కువగా విడుదల చేస్తే మరింత వేగం పుంజుకుంటుంది. నగర పంచాయతీగా ఏర్పడేందుకు అన్ని అర్హతలున్నాయి. పారిశ్రామికీకరణ పెరగడంతో వ్యాపారం జోరందుకోనుంది. గ్రామం విస్తీర్ణం ఐదేళ్లలో శరవేగంగా పెరిగింది.

– సిరాజుద్దీన్, కాంగ్రెస్ నాయకుడు, మోమిన్‌పేట

ప్రపోజల్స్ పంపించాం



ప్రభుత్వం నగర పంచాయితీగా ఏర్పాటు చేసేందుకు అవసరమైన వివరాలను పంపించాలని కోరారు. జనాభా, ఓటర్లు, విస్తీర్ణం, ఐదు కిలోమీటరుల పరిధిలోని ఆరు గ్రామ పంచాయతీలు వాటి పన్నుల వివరాలను పంపించాం.

– యాదగిరి, ఎంపీఓ, మోమిన్‌పేట



నూతన పీఎస్‌లో ఎస్‌ఐ భరత్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది

శాంతిభద్రతలే లక్ష్యం

చట్టాన్ని గౌరవించాలి
- చిన్న గొడవలను పెద్దవి చేసుకోవద్దు
- దుద్యాల్ ఎస్‌ఐ భరత్‌కుమార్‌రెడ్డి
- కొత్త పీఎస్‌కు 27 మంది సిబ్బంది కేటాయింపు

దుద్యాల్: లగచర్ల ఘటన నేపథ్యంలో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టిసారించింది. ఇందులో భాగంగా దుద్యాల్‌లో నూతన పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసింది. ఇక్కడ తొలి ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన భరత్‌కుమార్‌రెడ్డిని కలిసిన 'సాక్షి' శుక్రవారం పలు అంశాలపై ఆయనతో ముచ్చటించింది. వివరాలు ఎస్‌ఐ మాటల్లోనే..

ప్రతీక్షణం ప్రజలకు అందుబాటులో ఉండి శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తా. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేస్తాం. అందుకు తగ్గట్టుగా ప్రతీ గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. చట్టాలు, డయల్ 100పై విస్తృత ప్రచారం చేస్తాం. ప్రజలందరూ గొడవలకు దూరంగా ఉండాలి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిని ఉపేక్షించేది లేదు. ఏ సమస్యలు ఉన్నా సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలి. చిన్నచిన్న కారణాలతో గొడవలు పెద్దవి చేసుకోవద్దు. మండల ప్రజల మనోభావాలకు ప్రాధాన్యం ఇస్తాం. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలి.

సంతోషంగా ఉంది

కొత్త మండలంలో తొలి ఎస్‌ఐగా బాధ్యతలు తీసుకోవడం సంతోషంగా ఉంది. గతంలో నవాబుపేట, కొడంగల్, తాండూరులో విధులు నిర్వర్తించా. పోలీస్ స్టేషన్‌కు నాతో కలిపి 27 మంది సిబ్బందిని కేటాయించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకుంటాం.

– భరత్‌రెడ్డి, దుద్యాల్ ఎస్‌ఐ

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ

- ఒకరి మృతి
- దంపతులకు గాయాలు



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

చేవెళ్ల: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపిన ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం అంగడి చిట్టెంపల్లి గ్రామానికి చెందిన రాజమల్లయ్య(53) వ్యక్తిగత పనుల నిమిత్తం చేవెళ్లకు వచ్చాడు. సాయంత్రం తిరుగుప్రయాణంలో మిర్జాగూడ స్టేజీ సమీపంలో మండల పరిధిలోని ఇక్కరెడ్డిపల్లికి చెందిన రామస్వామి, మాధవి దంపతులు బైక్‌పై ఎదురుగా వచ్చి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాజమల్లయ్య తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దంపతులకు గాయాలవ్వడతో చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తపాలా కార్యాలయంలో 'ఆధార్'



తపాలా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కౌంటర్

- ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసిన ఉన్నతాధికారులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని తపాలా కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఆధార్ కౌంటర్‌ను ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తపాలా సిబ్బంది కోరుతున్నారు. నూతన ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ అనుసంధానం, పేరు, చిరునామా మార్పు, తప్పుల సవరణ, బయోమెట్రిక్‌తో పాటు మరిన్ని సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పేరు, చిరునామా, పుట్టిన తేదీ మార్పులకు అవసరమైన ధృవీకరణ పత్రాలతో కౌంటర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ తపాలా కార్యాలయ సేఊవలు మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోకి వస్తాయన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



పట్టణంలోని తపాలా కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఆధార్ కౌంటర్‌ను ప్రజలు వినియోగించుకోవాలి. తపాలా కార్యాలయాల్లో సేవలు విస్తరించేందుకు శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

– ఎస్.విజయజ్యోతి, తపాలాశాఖ పర్యవేక్షకులు, మహబూబ్‌నగర్ జిల్లా

ప్రపంచ శాంతికోసమే ధ్యానం

- పత్రీజీ కృషి ప్రశంసనీయం
- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



వేడుకకు హాజరైన ధ్యానులు

కడ్తాల్: ప్రపంచ శాంతి కోసమే పత్రీజీ ధ్యానం చేస్తున్నారని, ధ్యాన మార్గంలో ఆయన చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. మహాయాగం శుక్రవారానికి ఏడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జైపాల్ యాదవ్ మాట్లాడుతూ.. మహేశ్వర మహా పిరమిడ్‌తో ఈ ప్రాంతానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. దీనికి దివంగత ధ్యాన గురువు సుభాష్ పత్రీజీయే కారణమని తెలిపారు. పత్రీజీతో పరిచయమైన అనంతరం తాను పూర్తిగా శాకాహారిగా మారిపోయానని, ప్రతి ఒక్కరూ ఆయనను అనుసరించి శాకాహార జగత్తుకు కృషి చేయాలని కోరారు. పత్రీజీ గొప్ప మహర్షి, కారణ జన్ముడని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ధ్యాన యజ్ఞం నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. విశాఖపట్నం ఎంపీ భరత్ ప్రసంగిస్తూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఠాధిపతి రాజరాజేశ్వరనందా, వసుంధైక ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగేంద్ర, ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆ భయం వల్లేనా!

భారీగా పడిపోయిన గ్రేటర్ టౌన్‌ప్లానింగ్ ఆదాయం

సాక్షి, సిటీబ్యూరో: హైడ్రా భయం భవన నిర్మాణాలపై ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీకి గతంలో వచ్చిన ఆదాయం ఈ సంవత్సరం రాలేదు. చెరువులు, సరస్సులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా ఎందుకనో గానీ ప్రజల్లో..ముఖ్యంగా రియల్టర్లలో వణుకు పుట్టిస్తోంది. వాస్తవానికి హైడ్రా రియల్టర్ల జోలికి వెళ్లడం లేదు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల మేరకు చెరువులను కబ్జాలు చేసి నిర్మిస్తున్న భవనాలనే కూల్చివేస్తోంది. కానీ అనవసర భయాలతో రియల్టర్లు కొత్త ప్రాజెక్టులకు వెనుకడుగు వేస్తున్నట్లు కనిపిస్తోంది. జీహెచ్‌ఎంసీకి గత సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం భవన నిర్మాణ ఫీజుల ద్వారా రావాల్సిన ఆదాయం గణనీయంగా తగ్గడం ఇందుకు ఉదాహరణ. పెద్దపెద్ద నిర్మాణాలు జరిగితేనే ఫీజుల రూపేణా అధిక ఆదాయం వస్తుంది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023–24)లో జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ద్వారా రూ.1695 కోట్ల ఆదాయం ఖజానాకు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) అక్టోబర్ నెలాఖరు వరకు వచ్చింది రూ.459 కోట్లు మాత్రమే. నవంబర్, డిసెంబర్‌లలోనూ పెద్ద నిర్మాణాల అనుమతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. 2023–24 తోపోలిస్తే ఇంకా సగం ఆదాయం కూడా రాలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మిగిలిన మూడునెలల్లో ఏమేర ఆదాయం వస్తుందో చెప్పలేని పరిస్థితి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రూ.1000 కోట్లు సమకూరడం కూడా కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

లేనిపోని భయాలు

కొత్త నిర్మాణాలకు రియల్టర్లు వెనుకడుగు వేస్తుండటంతో మెజార్టీ రియల్టర్లు ఇంతకాలం చెరువులు, సరస్సులను కబ్జాచేసే నిర్మాణాలు చేశారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇప్పటికే భారీ నిర్మాణాలు జరిగినందున ఖాళీ స్థలాలంటూ లేనందున కొత్తగా నిర్మాణాలు జరగడం లేవని టౌన్‌ప్లానింగ్ వర్గాలు చెబుతున్నాయి. పాతభవనాలను కూల్చి అధునాతనంగా నిర్మించే వారుంటే తప్ప పెద్ద నిర్మాణాలు వచ్చే అవకాశాల్లేవని కూడా చెబుతున్నాయి.

కూల్చివేతలకే కాదు..

హైడ్రా అనగానే ప్రజలకు కూల్చివేతలే గుర్తుకొస్తుండటం దారుణం. మూసీ పునరుజ్జీవనానికి సంబంధించి ఆస్తులు కూల్చివేసింది రెవెన్యూ విభాగం అయినప్పటికీ, హైడ్రా కూల్చివేసిందనే ప్రచారంతో అదే ముద్ర పడింది. హైడ్రా ఉన్నది కేవలం కూల్చివేతలకే కాదు.. విధుల్లో అదొక భాగం మాత్రమే. అన్ని రకాల ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, విపత్తు నిర్వహణలు కూడా ఉన్నాయి. ట్రాఫిక్ చిక్కుల పరిష్కారానికీ పనిచేస్తుంది. వీటి గురించి సామాన్య ప్రజలకు తగిన అవగాహన లేకపోవడం హైడ్రా నిందల పాలయ్యేందుకు కారణమైంది. ఈ అంశంలో ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాల్సిన అవసరముందని పట్టణ ప్రణాళిక నిపుణులు చెబుతున్నారు.

సాగు పంటలే నమోదు చేయించాలి

- నిర్లక్ష్యం వహిస్తే విక్రయానికి ఇబ్బందులు
- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి



వేరుశనగ పంటకు ఆశించిన పురుగు నివారణ చర్యలు వివరిస్తున్న డీఏఓ మోహన్‌రెడ్డి

దుద్యాల్: రైతులు సాగు చేసిన పంట వివరాలనే వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేయాలని వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని ఈర్లపల్లిలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పంట విత్తే సమయంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సాగు పంటల వివరాలను సర్వే నంబర్ ప్రకారం నమోదు చేశారు. కొంతమంది రైతులు సాగు చేయకుండానే పంట వేసినట్లు నమోదు చేయించారనే సమాచారం అందిందని.. ఈ మేరకు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తున్నామన్నారు. సర్వే నంబర్ ప్రకారం నమోదు చేసే పంటలనే కొనుగోలుకు అవకాశం ఉన్నందున రైతులు పంట నమోదులో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ తులసి, ఏఈఓ మాణికేశ్వరి, రైతు రవి నాయక్ తదితరులు ఉన్నారు.

వేరుశనగలో సస్యరక్షణ తప్పనిసరి

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ప్రకారం వేరుశనగ పంటకు పురుగు ఆశించే అవకాశం ఉందని డీఏఓ మోమన్‌రెడ్డిద అన్నారు. ఇందుకుగాను ఆయన రైతులకు పలు సూచనలు నివారణ చర్యలు వివరించారు.

- ప్రస్తుతం వేరుశనగకు టిక్కా ఆకుపచ్చ తెగులు ఆశిస్తుంది. దీని నివారణకు 1 మిల్లీలీటర్ టెబుకొనజోల్ లేదా రెండు గ్రాముల క్లోరోథాలోనిల్ రసాయణాన్ని లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- మొవ్వకుళ్లు నివారణకు 0.5గ్రాముల థయోమిథాక్సిమ్ రసాయణాన్ని లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- మొదలు కుళ్లు నివారణకు రెండు గ్రాముల కార్బండజిమ్, మాంకోజెబ్ మిశ్రమ రసాయణాన్ని లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పొగాకు లద్దె పురుగు నివారణకు జల్లెడ ఆకులను ఏరివేసి పురుగులను నాశనం చేయాలి. పురుగు చిన్నగా ఉన్నపుడే ఐదు శాతం వేప గింజల కశాయం పిచికారీ చేయాలి. ఎదిగిన లార్వా నివారణకు ఒక మిల్లీ లీటర్ లీనోవాల్యూరాన్ లేదా 0.2 మిల్లీలీటర్ల ఫ్లూబెండమైడ్ రసాయణాన్ని లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పేరిట మోసం

- ఒక్కొక్కరి వద్ద రూ.13వేల నుంచి రూ.40వేల వరకు టోకరా
- మోసపోయామని గ్రహించి పీఎస్‌కు పరుగులు
- మధ్యవర్తి నుంచి డబ్బులు ఇప్పించాలని బాధితుల పట్టు



డబ్బులు ఇచ్చి మోసపోయిన బాధితులు సాయమ్మ, హన్మంతు



ఠాణాలో మధ్యవర్తి రాములమ్మ

ధారూరు: ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తానంటూ డబ్బులు వసూలు చేసిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని హరిదాస్‌పల్లికి చెందిన చింతకుంట రాములమ్మ నెల క్రితం యాలాల మండలం కోకట్ గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. అక్కడ శ్రీను అనే వ్యక్తి పరిచయమయ్యాడు. మాటలు కలిపిన మోసగాడు తాను కొండగల్‌లో ప్రభుత్వ ఉద్యోగినని.. పది మంది మహిళల చొప్పున గ్రూపులు తయారు చేసి ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేయిస్తే అందరికి ఇళ్లు మంజూరు చేయిస్తానని నమ్మించాడు. అతని మాటలు నమ్మిన రాములమ్మ ధారూరు వస్తే తనకు తెలిసిన వారిని పరిచయం చేస్తానని చెప్పింది. ధారూరులోని ఓ బంగారం షాప్ దగ్గరకు వచ్చిన శ్రీను రాములమ్మను అక్కడకు రమ్మన్నాడు. ఆమె వెంట వచ్చిన వారికి మాయ మాటలు చెప్పి ఇళ్ల కోసం ఒక్కొక్కరు రూ.50 వేల చొప్పున ఇవ్వాలన్నాడు. మాటలు నమ్మిన హరిదాస్‌పల్లికి చెందిన ఏర్పుల సాయమ్మ రూ.20 వేలు, అనంతమ్మ రూ.13వేలు, పద్మమ్మ రూ.8వేలు చొప్పున రాములమ్మ ద్వారా సమర్పించుకున్నారు. అనంతరం మున్నూరుసోమారం గ్రామానికి చెందిన హన్మంత్ నుంచి రూ.30 వేలు రాబట్టాడు. ఇలా రాములమ్మ ద్వారా మండలంలోని పలువురిని పరిచయం చేసుకుంటూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పేరిట రూ.వేలల్లో రాబట్టి జారుకున్నాడు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇంటింటి సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు మాకు ఎలాగో ఇళ్లు మంజూరు అవుతుందని.. మీకెందుకు వివరాలు చెప్పాలని ఎదురు ప్రశ్నిచారు. అనంతరం బాధితులు అధికారులకు ఇందిరమ్మ ఇళ్లకు డబ్బులు ఇచ్చామని చెప్పారు. దీంతో మోసపోయారని చెప్పడంతో బాధితులు రాములమ్మ వద్దకు వెళ్లి తమ డబ్బులు ఇప్పించాలని పట్టుబట్టారు. దీంతో ఆమె శ్రీనుకు ఫోన్ చేసి చెప్పడంతో డబ్బులు తీసుకువస్తున్నాని వికారాబాద్‌కు రమ్మని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. చివరకు బాధితులు తమకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నారు. దీంతో ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ శ్రీను ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. పోలీసులు రాములమ్మను విచారించగా ముందుగా తానే రూ.40వేలు ఇచ్చానని ఎస్‌కు వివరించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మధుబన్ కాలనీలో 'కార్డన్ సర్చ్'


- అనుమానాస్పద ప్రాంతాల్లో మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల తనిఖీలు
- నిషేధిత గుట్కా ప్యాకెట్ల స్వాధీనం
- ధ్రువపత్రాలు లేని వాహనాల సీజ్
- గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు: ఇన్‌స్పెక్టర్ నరేందర్



మధుబన్ కాలనీలో పోలీసుల కార్డన్ సర్చ్

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి కార్డన్ సర్చ్ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.నరేందర్ ఆధ్వర్యంలో మధుబన్ కాలనీలోని పలు ప్రాంతాల్లోని దుకాణాల్లో నిల్వ చేసిన నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే వాహనాలకు సరైన నెంబర్ ప్లేట్లు, ధ్రువపత్రాలు లేని వాటిని సీజ్ చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ పి.నరేందర్ మాట్లాడుతూ... మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇతర రాష్ట్రాలకు చెందిన అనేక మంది వలస కార్మికులు వచ్చి నివాసం ఉంటున్నారన్నారు. చాలా దుకాణాల్లో నిషేధిత గుట్కాలను విక్రయిస్తూ చట్టాలను ఉల్లంఘిస్తున్నారన్నారు. వీటిని ఉపేక్షించమన్నారు. కొన్ని ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు తమకు సమా చారం అందుతుందన్నారు. గంజాయి విక్రయించిన, సేవించిన చట్టరీత్య చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తుకు బానిసై తమ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఆయన సూచించారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి ఇలాంటి వారిని గుర్తిస్తున్నారన్నారు. ఇప్పటికే పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలను చేపడుతున్నామన్నారు. కార్డన్ సర్చ్‌లో ఎస్‌ఐ పైడినాయుడు, ఏఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



హయత్‌నగర్: వ్యవసాయ పొలం వద్ద ఉన్న ఓ గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన శుక్రవారం హయత్‌నగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన ప్రకారం.. తుర్కయాంజాల్ నుంచి బ్రాహ్మణపల్లికి మార్గంలో కొంతం నర్సింహారెడ్డి పొలం వద్ద ఫెన్సింగ్ పక్కన ఓ మృతదేహం కనిపించిందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు హయత్‌నగర్ పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 60 ఏళ్లు ఉంటుందని.. ఎవరైనా గుర్తిస్తే తమను సంప్రదించాలన్నారు.